ప్రజాశక్తి
మంగళవారం 4 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం

ఏకలవ్య కళాశాలల్లో ప్రవేశాలకు 7న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 7న ఏకలవ్య కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏకలవ్య డిస్ట్రిక్ట్ కన్వీనర్, ప్రిన్సిపల్ కుప్పులి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల భామిని, మెలియాపుట్టి ఏకలవ్య కళాశాలల ప్రవేశానికి కొత్తూరు పోస్ట్‌మెట్రిక్ హాస్టల్లో అదేరోజున కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని, ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి గ్రూపులు ఈ ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు.

ప్రజలంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఉల్లిభద్రలో గల ఉద్యానకళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు సైతం కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 8 గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుంది. అరగంట తరువాత ఇవిఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

- ప్రజాశక్తి, పార్వతీపురం

కౌంటింగ్‌కు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నేడే ప్రజా తీర్పు

- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- పార్లమెంటు బరిలో 13, అసెంబ్లీకి 29 మంది పోటీ

బరిలో 29 మంది అభ్యర్థులు

మే 13న జరిగిన ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 29 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అరకు పార్లమెంటు స్థానంలో 13 మంది పోటీ చేశారు. పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 8 మంది, కురుపాం, సాలూరు, పాలకొండలో ఏడుగురు చొప్పున అభ్యర్థులు పోటీ చేశారు.

77.10 శాతం పోలింగ్ నమోదు

గత నెలలో జరిగిన ఎన్నికలో పార్వతీపురం మన్యం జిల్లాలో 77.10 శాతం ఓటింగ్ నమోదైంది. కురుపాంలో 78.54 శాతం, పాలకొండలో 75.26, పార్వతీపురంలో 78.23, సాలూరులో 76.45 శాతం పోలింగ్ నమోదైంది.

ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం

మంగళవారం ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది, అరగంట తర్వాత ఇవిఎంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. అన్నిచోట్లా అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అరకు పార్లమెంటు స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో (అరకు, రంపచోడవరం పాడేరు సహా) పార్లమెంటుకు పోలైన పోస్టల్ బ్యాలెట్లన్నీ ఇక్కడే లెక్కి స్తారు. కురుపాం, సాలూ రు, పాల కొండ, పార్వతీ పురం పరిధి లోని పార్లమెంట్ స్థానం ఓట్లను పార్వతీపురంలోనే లెక్కిస్తారు.

9 టేబుళ్లు ఏర్పాటు

అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒకటి, నాలుగు నియోజకవర్గాలకు 8 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గానికి 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

పలువురు సిబ్బంది నియామకం

రాండమైజేషన్ ద్వారా మొత్తం 394 మందిని కౌంటింగ్ కోసం కేటాయించగా, వీరిలో కౌంటింగ్ సూపర్వైజర్లు 181 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 213 మంది ఉన్నారు. వీరే కాక ప్రతి టేబుల్ ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద జరిగే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద ఇద్దరు మైక్రో అబ్జర్వర్ ఉంటారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాలకు సంబంధించి వేర్వేరుగా పాలకొండ 21, పార్వతీపురం 17, సాలూరు 18, కురుపాం 21 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అన్ని టేబుళ్ల వద్దా లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. పార్వతీ పురం నియోజకవర్గం నుంచి అధికారికంగా తొలి ఫలితం వెలువడే అవకాశం ఉంది.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు,రెండు డ్రోన్లు నిరంతర నిఘా ఉంటుంది. డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా, లెక్కింపు కేంద్రాలను నో ఫ్లై జోన్ గాప్రకటించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యాక కూడా ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు. ఎస్‌పి, ఎఎస్పీ, ముగ్గురు డిఎస్పీలు, 17 మంది సిఐలు, 24 మంది ఎస్ఐలతో సహా 500 మంది పోలీసు బందోబస్తు, ఒక కేంద్ర బలగంతో బందో బస్తు ఉంటుంది. అదనంగా మూడు కేంద్ర బలగాలు వచ్చాయి. ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద ఒక సిఐ స్థాయి అధికారి బందోబస్తు పర్యవేక్షిస్తారు.

లెక్కింపు ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

పార్వతీపురంరూరల్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. ఉద్యాన కళాశాలలో జిల్లాలో నాలుగు శాసనసభ నియోజక వర్గాల ఇవిఎం ఓట్ల లెక్కింపుతో సహా అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన మొత్తం పోస్టల్ బ్యాలెట్లు, నాలుగు శాసన సభ నియోజక వర్గాల పరిధిలోని పార్లమెంటు ఇవిఎం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆ మార్గంలో సిఆర్‌పి ఎఫ్, సిఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 158 సిసి కెమెరాలు, రెండు డ్రోన్లు నిరంతర నిఘాలో ఉంటాయని వివరించారు. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా నో ఫ్లై జోన్‌గా ప్రకటించామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోభిక, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, ఎఎస్‌పిలు డాక్టర్ దిలీప్‌కిరణ్, సునీల్ షరోన్, పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

సమన్వయంతో భద్రతా చర్యలు : ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి కౌంటింగ్ పూర్తయ్యే వరకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రత నిర్వహణలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సోమవారం ఉద్యానవన కళాశాల ప్రాంగణంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ బందోబస్తు విధి విధానాలపై (బ్రీఫింగ్) సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్ లోపలికి ప్రవేశించే ప్రతి ఒక్కర్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డు పరిశీలన అనంతరం అనుమతించాలన్నారు. 144సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉన్నందున 4గురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండకుండా చూడాలని, విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదని, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా బందోబస్తులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తతో విధులు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎఎస్‌పిలు డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, డిఎస్‌పిలు డిఎస్పీ జివి కృష్ణారావు, ఎస్ఆర్ హర్షిత, మురళీధర్, వెంకట అప్పారావు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 19738 పోస్టల్ బ్యాలెట్లు

విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో మొత్తం 19738 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. వీటిలో రాజాం అసెంబ్లీ నియోజకవర్గంలో 3000 పోస్టల్ ఓట్లు, బొబ్బిలిలో 2917, చీపురుపల్లిలో 1851, గజపతినగరంలో 2408 , నెల్లిమర్లలో 2097, విజయనగరంలో 4838, శంగవరపుకోట నియోజకవర్గంలో 2627 పోస్టల్ ఓట్లు నమోదయ్యాయి. విజయనగరం పార్లమెంటు స్థానంలో మొత్తం 19545 పోస్టల్ ఓట్లు వచ్చాయి. సర్వీసు ఓటర్లుకు ఇచ్చిన ఈటిపిబి ఓట్లను మంగళవారం ఉదయం 8 గంటల వరకు స్వీకరించి లెక్కించనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్‌స్టేషన్లు	రౌండ్లు
పార్వతీపురం	233	17
పాలకొండ	287	21
కురుపాం	268	20
సాలూరు	243	18
రాజాం	284	21
బొబ్బిలి	264	19
చీపురుపల్లి	257	19
గజపతినగరం	264	19
నెల్లిమర్ల	248	18
విజయనగరం	260	19
శృంగవరపుకోట	270	20

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా టేబుళ్లను ఏర్పాటుచేస్తారు. రాజాంకు 21 రౌండ్లు, బొబ్బిలికి 19, చీపురుపల్లి కి 19, గజపతినగరం కు 19, నెల్లిమర్ల కు 18, విజయనగరం కు 19, ఎస్.కోట కు 20 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అన్ని టేబుళ్ల వద్దా లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి అధికారికంగా తొలి ఫలితం వెలువడే అవకాశం ఉంది.

హోరాహోరీ పోటీలో గెలిచేదెవరో?

- సాలూరు, పార్వతీపురం, నెల్లిమర్ల మొదటగా వెలువడే అవకాశం
- రాజాం, పాలకొండ కాస్త ఆలస్యమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నరాలు తెగేంత ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. హోరా హోరీగా జరిగిన ఈ ఎన్నికల పోటీలో గెలిచేదెవరనేది కొన్ని గంటల్లోనే తేలనుంది. అభ్యర్థుల భవితవ్యంతో పాటు రాష్ట్రాన్ని ఏలే పార్టీ యేదో? జిల్లాలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందో? మంగళవారం సాయంత్రానికి తేలనుంది. మధ్యాహ్నానికే ఫలితాలు ఓ కొలిక్కిరానున్నాయి. గత నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. విజయనగరం జిల్లాలో 81.33శాతం. పార్వతీపురం మన్యం జిల్లాలో 77.10 శాతం ఓట్లు పోలయ్యాయి. విజయనగరం పార్లమెంట్ పరిధిలో 81.05శాతం, అరకు పార్లమెంట్ 73.68 శాతం ఓట్లు పోలయ్యాయి. మునుపెన్నడూ లేనంతగా ఓటర్లలో చైతన్యం కనిపించింది. ఓటింగ్‌లో మహిళలు ఎక్కువగానే పాల్గొన్నారు. జనాల్లో ఫలితాలపై ఇదే ఆసక్తి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులూ ఎవరి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపు, ఓటమికి ప్రతి ఓటూ కీలకమే. అయినప్పటికీ ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి. విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న 21,836 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పించగా, 19,738 ఓట్లు పోలయ్యాయి. మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో విజయనగరం నియోజకవర్గంలో అత్యధికంగా 4,944 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లు లెక్కింపుకోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు టేబుళ్లు, పార్లమెంట్ స్థానానికి 20టేబుళ్లు వేయనున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ 17 నుంచి 21 రౌడ్ల వరకు ఉన్నాయి. దీన్ని బట్టి విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల, మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు మొదటగా వెలువడే అవకాశాలు ఉన్నాయి. రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లో అత్యధికంగా 21 రౌండ్లు ఉండడంతో మిగిలిన వాటితో పోలిస్తే ఈ రెండు చోట్ల ఫలితాలు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. కౌంటింగ్, అనంతరం ఫలితాల నేపథ్యంలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు సోమవారం సాయంత్రానికి విజయనగరం, పార్వతీపురం జిల్లా కేంద్రాలకు చేరుకున్నారు. ముఖ్యంగా టిడిపి కార్యాలయం (అశోక్ బంగ్లా)కు వచ్చిన కేడర్ సేదదీరేందుకు పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేసింది. అటు వైసిపిలోనూ ఇదే జోష్ కనిపిస్తోంది.

పార్వతీపురం ఎవరిపరమో?

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

రెండు నెలలుగా సాగుతున్న సుదీర్ఘ రాజకీయ ఎన్నికల ప్రహసనం మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపుతో ముగియనుంది. పార్వతీపురం పీఠం ఎవరి పరం కానుందో తేలనుంది. పోటీపోటీగా జరిగిన ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది.

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా ఏడాది క్రితం నియోజకవర్గానికి ఏ మాత్రం పరిచయంలేని బోనెల విజయచంద్ర పోటీ చేయగా, వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావు బరిలోకి దిగి బాహాబాహీగా తలపడ్డారు. ఈ ఎన్నికల్లో బలమైన అభ్యర్థిగా ఊహించుకున్న అలజంగి జోగారావుకు ఏ మాత్రం అంచనాలు లేని విజయ్‌చంద్ర గట్టి పోటీ ఇచ్చారు. గతంలో 24 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన అలజంగి ఈసారి 8వేల మెజారిటీతో గట్టెక్కుతామన్న అంచనాకు రావడమే టిడిపి వర్గాలు విజయంగా భావిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అలజంగి జోగారావుకు 74,223 ఓట్లు, టిడిపి అభ్యర్థి బొబ్బిలి చిరంజీవులుకు 50,661 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 1,964, బిజెపికి 960, జనసేనకు 6,538, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒకరికి 714, మరొకరికి 465, నోటాకు 3515 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్లో వైసిపికి 1,081, టిడిపికి 444 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం ఎన్నికల్లో పార్వతీపురంలో 78.23 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 1,89,817 ఓట్లు ఉండగా.. ఇందులో 1,48,502 ఓట్లు పోల య్యాయి. మహిళలు 75,908 మంది, పురుషులు 72,592 మంది ఇతరులు ఇద్దరు.. తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఓటు వేసిన వారిలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. టిడిపికి పార్వతీపురం నియోజకవర్గంలో మంచి పట్టు ఉండడంతో ఆ పార్టీకి భారీగా ఓట్లు పడ్డాయని ఆ పార్టీ వర్గీయులు భావిస్తున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో సీతానగరం, పార్వతీపురం, బలిజిపేట మండలాల్లో ఏ ప్రాంతంలో చూసుకున్నా కూటమి అభ్యర్థి విజయచంద్రకే ఎక్కువ ఓట్లు పడ్డాయని ఆ పార్టీల నాయకులతో పాటు పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయినా టిడిపి ప్రభావం నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లోనేనని మిగతా ప్రాంతాల్లో వైసిపికి గుంపగుత్తగా ఓట్లు పడ్డాయని, కనుక ఈసారి మెజార్టీ తగ్గినా గెలుపు వైసిపిదేనని, జోగారావే మళ్లీ ఎమ్మెల్యే కావడం తథ్యమని వైసిపి వర్గాలు బల్లగుద్ది మరీ చెబుతున్నాయి.

సెంటిమెంట్‌కు బ్రేకులు పడేనా?

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గాన్ని ఎస్సీలకు కేటాయించారు. అప్పటి నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. అయితే, గత మూడు ఎన్నికల నుంచి ఎవరు పోటీ చేసినా ఓటర్లు వారికి ఎమ్మెల్యేగా ఒక్కసారికే అవకాశం ఇస్తున్నారు. ఇక్కడ పోటీ చేసి గెలిచిన వారు రెండోసారి పోటీలో లేకపోవడం లేదా పోటీ చేసినా గెలవకపోవడం కనిపిస్తుంది. ఈ సెంటిమెంట్ నిజమైతే ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి జోగారావు రెండోసారి గెలిచే అవకాశం లేనట్లేనని టిడిపి వర్గాలు భావిస్తున్నప్పటికీ ఈసారి ఆ సెంటిమెంటును జోగారావు తప్పకుండా బ్రేక్ చేస్తారని వైసిపి నాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

గత ఎన్నికల్లో వైఎస్ జగన్ ఒక్కచాన్స్ హవాలో జోగారావు గెలుపొందారని, ఈ ఎన్నికల్లో మాత్రం ఆ పరిస్థితి లేదని టిడిపి నాయకులు చెబుతున్నారు. అలాగే, గత ఎన్నికల్లో వైసిపికి మద్దతు తెలిపిన వ్యాపారులు ఈసారి టిడిపికి జై కొట్టారు. తమ వ్యాపారాలను పక్కన పెట్టి మరి విజయచంద్రకు ప్రచారం చేశారు. వీరంతా ఆయనకే ఓటేసినట్లు స్పష్టమైన సంకేతాలు ఉన్నాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్ కూడా విజయచంద్రకు అత్యధిక ఓట్లు పోలైనట్లు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా 80వేలకు పైబడి ఓట్లు కూటమి అభ్యర్థికే పడే అవకాశాలున్నట్లు రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఈ లెక్కన 15 వేల పైబడి మెజార్టీతో విజయచంద్ర విజయం సాధిస్తారని చెబుతున్నారు. ఇరువర్గాల్లోనూ ఇదే ధీమా వ్యక్తం అవుతున్నప్పటికీ మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో ఇరువురి అభ్యర్థుల భవితవ్యం తేలిపోతుంది.

కురుపాంలో గెలుపు ఎవరిది?

అందరిలోనూ ఉత్కంఠ • ఫలితాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్న 2024 ఎన్నికల కౌంటింగ్‌కు సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ముఖ్యంగా కురుపాంలో గెలుపు ఎవరిదనేది ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 2024 ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. కురుపాంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుష్ప శ్రీవాణి, టిడిపి అభ్యర్థి జగదీశ్వరి మధ్య పోటీ రసవత్తరంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పుష్పశ్రీవాణితో తొలిసారిగా తోయిక జగదీశ్వరి ఢీ కొంటున్నారు. 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పుష్పశ్రీవాణి 2024 ఎన్నికల్లోనూ గెలుపొంది హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. మొదటిసారి గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతం నుంచి తొలిసారిగా పోటీ చేస్తున్న తోయిక జగదీశ్వరీ ఈ ఎన్నికల్లో పుష్పశ్రీవాణిని ఓడించి కురుపాంలో టిడిపి జెండాను ఎగురవేస్తామని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. 57 ఏళ్ల నియోజకవర్గ చరిత్రలో 20 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఒకసారి మాత్రమే విజయం సాధించింది. 1994 లో టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజు గెలిపొందారు. అప్పటి నుంచి టిడిపి విజయం నమోదు కాలేదు. ఈ సారి ప్రజల తీర్పు ఏ విధంగా ఉండబోతోంది, ఎవరు ఎంత మెజార్టీతో గెలుపొందుతారు? ఏ పార్టీని ప్రజలు ఆదరిస్తారు? కురుపాం క్వీన్ ఎవరు అవుతారు? అన్న చర్చకు నేటితో తెరపడనుంది. టీవీల్లో ఎగ్జిట్ పోల్స్ వచ్చినా ఎగ్జాక్ట్ గా వచ్చే ఫలితాలపైనే ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు వచ్చే ఫలితాలతో ఎవరు విజయం సాధిస్తారో, ఎవరు పరాజయం చెందుతారో వేచి చూడాల్సిందే.

పింఛన్ల కోసం బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

పింఛనుదార్లకు తప్పని తిప్పలు

ఉదయం నుంచే బ్యాంకుల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెలలోనూ పింఛను లబ్దిదారులకు కష్టాలు తప్పలేదు. పింఛను మొత్తాలను లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో వృద్ధులు, వికలాంగులు అనేక అవస్థలు పడ్డారు. సోమవారం ఉదయం నుంచే బ్యాంకుల ముందు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం పడిగాపులు పడ్డారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సర్వీస్ పాయింట్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంక్‌ల వద్ద పింఛను లబ్దిదారులు గంటల తరబడి నిరీక్షించారు. సాలూరు, పాచిపెంట మండలాల నుంచి ఉదయాన్నే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం బ్యాంక్‌ల వద్ద క్యూలైన్‌లో నిలబడిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని పెదహరిజనపేటకు చెందిన నిమ్మకాయల వసంత అనే వికలాంగురాలు మండుటెండలో మూడు చక్రాల బండిలో బ్యాంక్‌కు వచ్చి పింఛను డబ్బులు అందుకున్నారు. పింఛను కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని లబ్దిదారులు గుసగుసలాడుకుంటున్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని పింఛన్ల కోసం వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మూడో తారీఖు దాటిపోతున్నా ఇంకా తమకు పింఛన్లు అందలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకటో తారీఖన ఇంటి వద్దకే పింఛను ఇచ్చేవారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పింఛన్ల సొమ్మును బ్యాంకు ఖాతాల్లో వేశారు. దీంతో పింఛనర్లు బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడు రోజులు కావస్తున్నా ఇంత వరకూ తమకు పింఛను సొమ్ము అందలేదని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. ఇంటి దగ్గర నుంచి కదల్లేని వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటికి వెళ్లి పింఛన్లు అందించనా మిగతా వారి సొమ్ములను బ్యాంకుల్లో వేయడంతో వారంతా బ్యాంకులు, సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కొంత మంది సొమ్ములు బ్యాంకుల్లో కూడా జమకాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సీతానగరం: మండలంలోని పింఛనర్ల అవస్థలు పడుతున్నారు. నేరుగా బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేయడంతో వృద్ధులు, వితంతువులు, కొంతమంది వికలాంగులు సోమవారం ఉదయాన్నే ఆయా బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, కోపరేటివ్ బ్యాంకు, చినబాబుల విశాఖ గ్రామీణ బ్యాంకుల వద్ద పింఛనర్లు బార్లు తీరారు. గత రెండు నెలలుగా ప్రభుత్వం పింఛన్ దారులకు వారి బ్యాంకు ఎకౌంట్‌లో జమ చేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం గతం మాదిరిగానే ఇంటి వద్దకే పింఛను అందించాలని కోరుతున్నారు.

పింఛను కోసం నిరీక్షిస్తున్న వికలాంగురాలు వసంత

విద్యార్థులకు ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా డ్రాయింగ్ టీచర్ జి.మురళి ఆధ్వర్యంలో పిల్లలకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ముగింపు రోజు 7న బహుమతులు అందజేస్తామన్నారు. ఇందులో పిల్లలు చాలా మంది పిల్లలు పాల్గొన్నారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని గాజుల మర్రి, తెల, బాబు జగజీవన్ రావు కాలనీ వీధులతో పాటు నడుకూరు, చిట్టిపూడి వలస, తదితర గ్రామాల్లో సోమవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కంపు కొడుతున్న పల్లెలు అన్న శీర్షికన సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు.

పారిశుధ్యాన్ని తొలగిస్తున్న కార్మికుడు

ఫలితాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - పాలకొండ

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం అభ్యర్థులే కాదు ప్రజలు కూడా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఓటర్ల నాడి అంతుచిక్కకపోవడంతో కొద్ది రోజులుగా ఇరువురు కూడా అంచనాలకు అందకపోవడంతో టెన్షన్ పడ్డారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఏఏ మండలాలు తమకు అనుకూలంగా ఉన్నాయో కూడా పూర్తి స్థాయిలో అంచనాలకు అందకపోవడంతో లెక్కలు వేసుకుంటూ కాలం గడిపారు. నాలుగు మండలాల పరిధిలో ఓటర్లు ఎటువంటి విధంగా తీర్పు ఇచ్చారో తెలియక ఇరువురు అల్లకల్లోలం పడుతున్నారు. చివరికి సర్వే సంస్థలు కూడా పాలకొండ ఎమ్మెల్యే పీఠంపై క్లారిటీ ఇవ్వలేదు. నువ్వా-నేనా అనే పోటీ ఉందని ప్రధాన సర్వే సంస్థలు వెల్లడించాయి. ఒకపక్క గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల భయం కూడా అభ్యర్థులకు వెంటాడుతూ ఉంది. ఈసారి సీతంపేట మండలం ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల విజయావకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రూ.10 లక్షల విలువైన విత్తనాలు గుర్తింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ ఎరువుల దుకాణంలో రికార్డుల్లో పొందుపర్చిన రూ.10 లక్షల, 97,200 విలువ గల విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఈ విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని వ్యవసాయ శాఖ ఎడిఎ కె.రత్నకుమారి డీలర్‌ను ఆదేశించారు. స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు షాపును ఆకస్మిక తనిఖీ చేశారు. అనధికారంగా ఉన్న విత్తనాలకు సంబంధించి 21 రోజుల్లోగా తమకు ఆధారాలు చూపాలని డీలర్‌ను ఆదేశించారు. లేకుంటే షాప్‌ను సీజ్ చేస్తామన్నారు. అజయ్ రకం విత్తనాలు 231 ప్యాకెట్లు, నూజివీడు రకం 496 ప్యాకెట్లను అదనంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎరువుల షాపుల్లో ధరల పట్టిక, స్టాక్ వివరాలు తదితరమైనవి డీలర్ పాటించడంలేదన్నారు. విత్తనాలు, ఇతరాత్రా ఏ వస్తువులైన అమ్మకాలు జరిపినప్పుడు తప్పనిసరిగా బిల్లులు రైతులకు ఇవ్వాలన్నారు. మండలంలోని ఎరువులు షాపుల డీలర్లు నిబంధనలు పాటించకపోతే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎడిఎతో పాటు స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య ఉన్నారు.

లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఆశీలు చెల్లించాల్సిందే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో లారీ లోడింగ్‌కు రూ.200, అన్లోడింగ్‌కు రూ.200 మున్సిపల్ కమిషనర్‌చే నియమించబడిన మున్సిపల్ సిబ్బందికి ఆశీలును వ్యాపార సంస్థలు, లారీ యజమానులు చెల్లించాల్సిందేనని మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రుబేను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాల్టీకి సంబంధించిన కబేళాలకు, మార్కెట్, రోడ్డు మార్జిను ఆశీళ్ల వసూళ్లకు గానూ బహిరంగ వేలం పాటలో ఏ ఒక్క పాటదారుడు పాల్గొనేందుకు రానందున జనవరి నుండి మార్చి నెలాఖరు వరకు 10సార్లుకు పైగా బహిరంగ వేలం పాటలు వాయిదా పడిందని, దీనివల్ల మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల అనుమతితో మార్చి 1 నుంచి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఆశీలు వసూలు చేస్తామన్నారు. పాత ఆశీల్ల కాంట్రాక్టరు, సిబ్బంది పురపాలక సంఘం గెజిట్ నోటిఫికేషన్లో లారీ అన్లోడుకు రూ.200, లోడింగుకు రూ.200 వసూలు చేయించేందుకు నిర్ణయించామన్నారు. వ్యాపార సంస్థలు, యజమానులకు ఈ విషయం తెలియపర్చడం జరుగుతుందని, పురపాలక సంఘం పరిధిలో జరుగు ఎగుమతి, దిగుమతి చేసుకున్న వారు మున్సిపల్ సిబ్బంది చేసే ఆశీల్ల వసూళ్ల సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఫలితాల నేపథ్యంలో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్ పేట పోలీస్ సర్కిల్ పరిధిలో ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రత్యేకంగా గట్టి నిఘాను ఏర్పాటు చేశామని ఎల్విన్ పేట సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రత్యేకంగా భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో కురుపాం నియోజకవర్గ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడితే చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతి లేదని తెలిపారు. క్రాకర్స్ వాడినా చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీటర్ల పై నిఘా ఉంచామని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, కౌంటింగ్ పూర్తి కావడానికి వివిధ పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు అన్నారు. సోమవారం కురుపాంలో వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని గాంధీనగర్ వీధిలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

ఏజెన్సీ పైనాపిల్‌కు భలే గిరాకీ

- మద్దతు ధర కోసం ఎదురుచూపు
- సిండికేట్ అవుతున్న దళారులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలోని పైనాపిల్‌కు భలే గిరాకీ. ఇక్కడి గిరిజనులకు అటవీ ఫలసాయంలో ఎక్కువ ఆదాయం వచ్చే పంట కూడా ఇదే. ఈ పంటకు మైదాన ప్రాంతంలో మంచి ధర పలుకుతుంది. ఎందుకంటే ఇక్కడ పైనాపిల్ (అనాసపనస) ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా పండే పంట. అందుకే అనాసపనస కోసం ఎక్కువగా మైదాన ప్రాంతవాసులు మొగ్గుచూపుతారు. పైనాపిల్ పుల్లపుల్లగా తీయతీయగా మధురంగా జ్యూస్ చేసి తాగితే మరింత బలం, పోషకాలు ఉంటాయని వైద్యులు చెబుతుంటారు. సీతంపేట ఏజెన్సీలో పైనాపిల్ పంట 4వేల ఎకరాల్లో సాగవుతుంది. 20వేల మెట్రిక్ టన్నులు దిగుబడి అవుతుంది. ఈ పంట ఏడాదిలో రెండుసార్లు పండుతుంది. మే నెలలో పాటు డిసెంబర్‌లో కూడా ఈ పంట కాపుకు వస్తుంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో కుసిమి, దోనుబాయి, మొగధార, శంభం, పూతికవలస పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పండుతుంది. అయితే. ఇక్కడ గిరిజనులు కాయలు కోసి సీతంపేట, దోనుబాయి, కుసిమి తదితర సంతలకు తీసుకొచ్చి విక్రయిస్తారు. ప్రస్తుతం పైనాపిల్ ఒక్కొక్క కాయ పది రూపాయల నుంచి రూ.15 ధర పలుకుతుంది.

సంతకు తరలించిన పైనాపిల్స్

ఇది ఆరంభం దశలో డిమాండ్ ఉంది. మరో నెల రోజులు గడిస్తే ఒక్కొక్క అనాసపండు ఐదు రూపాయల లోపే ధర పడిపోతుంది. పైనాపిల్ కొనుగోలు చేయడానికి దళారులు ఒడిశా నుంచి భువనేశ్వర్, పర్లాకిమిడి, కటక్, ఆంధ్రా నుంచి విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తెలంగాణ నుంచి హైదరాబాదు తదితర ప్రాంతాలకు దళారులొచ్చి వ్యాన్లు వాహనాలు ద్వారా ఎగుమతులు చేస్తారు. అక్కడ ఒక్క పైనాపిల్ కాయ రూ.20 నుంచి రూ.40 వరకు కాయ సైజు ప్రకారం విక్రయిస్తారు. గతంలో ఇక్కడి ఐటిడిఎ పిఒల చొరవ తీసుకొని పైనాపిల్ పండు ఒక్కొక్కటి సైజును బట్టి పది రూపాయల నుంచి 12 రూపాయల వరకు ఐటిడిఎ కొనుగోలు చేసే వెలుగు ఆధ్వర్యంలో బయట మార్కెట్లకూ, రైతు బజార్లకు శ్రీకాకుళం, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి వరకు విక్రయించేవారు.

రైతుబజార్ మార్కెట్ ధర కల్పిస్తాం

సీతంపేట మండలంలో పైనాపిల్ అనాస పనస అధికంగా పండింది. ఇప్పటికే రైతు బజార్ సిఇఒ గుంటూరు రైతు బజార్లో 20 స్టాల్స్ కావాలని ప్రతిపాదనలు పంపించాం. వీటిలో విశాఖపట్నం 13, విజయనగరం 2, పార్వతీపురం, సాలూరుతో పాటు శ్రీకాకుళం 2 రైతు బజార్లో స్టాల్స్‌కు ప్రతిపాదనలు ఇచ్చాం. అనుమతులు రాకముందే వాహనాల ద్వారా విశాఖపట్నం, గాజువాక, సీతమ్మధార రైతుబజార్లకు పైనాపిల్ పంపించాం. తద్వారా గిరిజన రైతులకు మార్కెట్ ధర కల్పిస్తాం.

గణేష్,
ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, సీతంపేట ఐటిడిఎ.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న పైనాపిల్ కాయలు

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

జిల్లా మలేరియా అధికారి జగన్‌మోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సకాలంలో జ్వర నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు ఆదేశించారు. జ్వరాల సీజన్‌లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని ఆయన చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ల్యాబ్ టెక్నీషియన్‌లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో, క్షేత్ర స్థాయిలో జ్వర లక్షణాలున్న వారికి సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను సత్వరమే పరీక్షలు జరిపి జ్వర నిర్ధారణ చేయాలని తద్వారా మలేరియాగా గుర్తించినట్లయితే వెంటనే చికిత్స అందజేయాలని సూచించారు. ఆరంభంలోనే నిర్ధారణ చేసి ప్రాథమికంగా మందులు అందజేయడం వల్ల జ్వర తీవ్రతను అరికట్టడమే గాక, ఉన్నత ఆసుపత్రులకు వెళ్ళే ప్రయాస భారాన్ని తగ్గించవచ్చని అన్నారు. మలేరియా గుర్తించిన పరిధిలో వ్యక్తుల నుండి సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బంది సామూహిక మలేరియా నిర్ధారణ పరీక్షలు(మాస్ అండ్ కాంటాక్ట్) జరపాలని వారి నుంచి సేకరించిన రక్త పూతలను ల్యాబ్‌లో సకాలంలో పరీక్షలు జరిపి వెంటనే ఫలితాలు వెల్లడించాలన్నారు. ఎంఎఫ్7, ఎం4, ఎం3 రికార్డుల్లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. యాక్టివ్, పాసివ్ టెస్ట్‌ల లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ అదిగమించాలన్నారు. మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా విధానానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహనరావు

మలేరియా,డెంగీ కేసుల వివరాలు ఐహెచ్‌ఐపిలో ఆన్లైన్ తప్పనిసరి అని తెలిపారు. ల్యాబ్ టెక్నీషయన్లు సమయానికి విధుల్లో ఉండాలని, రానున్న సీజన్‌లో చాలా కీలకమని, జ్వర నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో జాప్యం వహిస్తే తగు చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఎంఒ సూర్యనారాయణ, ఇఒ నాగేంద్ర, సిబ్బంది అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలను అందిస్తున్న ఎఒ అవినాష్

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఎఒ ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలోని పనుగుపేట రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌కు సంబంధించి 1000, 64, 11, 21 ఆర్‌జెడీ రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వరి విత్తనాలు కేజీ రూ.10 లెక్క అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి రైతు ఆ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతి చెందిన పక్షులు

పిడుగుపాటుకు పక్షులు బలి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న చెట్టుపై ఆదివారం రాత్రి పిడుగు పడడంతో చెట్టుపై ఉన్న చిలుకలు, కాకులు, తదితర రకాల పక్షులు పిడుగు శబ్దానికి మృతి చెందాయి. అలాగే ఈ పరిసర ప్రాంతాల్లో ఉన్న గృహాల్లో ఇన్వెర్టర్ పరికరాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలకు విద్యుత్తు కష్టాలు తప్పలేదు. పక్షులు కూడా మృతి చెందడంతో వీటిని చూసిన వారంతా నివ్వెరిపోయారు. విద్యుత్తు కోతలు విపరీతమైన వర్షంతో ఆదివారం రాత్రి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు: డైరెక్టర్

గంజాయి, క్రికెట్ బెట్టింగ్‌లు, రమ్మీ ఆటల వినాశనంపై పార్వతీపురంలో షార్ట్ ఫిల్మ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్ళొద్దని షార్ట్ ఫిలిం డైరెక్టర్ ఏగిరెడ్డి సతీష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం మున్సిపల్ పార్క్, మెయిన్ రోడ్‌తో పాటు పలు ప్రదేశాలలో గీత ఈజ్ మై ఫ్రెండ్ అనే షార్ట్ ఫిలిం షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణానికి చెందిన షార్ట్ ఫిలిం నటులు వంగల దాలి నాయుడు మాస్టర్, మహేశ్వర అజయ్ తదితరులతో షూటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశలో యువత ప్రేమ పేరుతో చదువు పక్కన పెట్టి జీవితాలను నాశనం చేసుకోవడం జరుగుతోందన్నారు. దీని వల్ల బాగా చదివిన తెలివైన విద్యార్థులు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇదే ఇతి వృత్తంతో మద్యపానం, ధూమపానం, గంజాయి తదితర మత్తుపదార్థాలకులోనై యువత తన ఆరోగ్యాన్ని ఎలా పాడు చేసుకుంటున్నారో ఈ షార్ట్ ఫిలిమ్ ద్వారా చెబుతామన్నారు. క్రికెట్ బ్యాటింగ్‌లు, సెల్ఫోన్ వినియోగం, రమ్మీ ఆటలు తదితర వాటి ద్వారా రుణాల యాప్‌లలో అప్పుల తీసుకొని వారు పెట్టే ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు పాలవుతున్నారన్నారు. అటువంటివి ఎవరూ చేయకూడదని ఇతి వృత్తంతో ఈ షార్ట్ ఫిలిం తీస్తున్నామన్నారు. యువత తన కౌమార, యుక్త వయసులో చేసే లోపాలను ఎత్తిచూపుతూ వాటిని సరిదిద్దుకొని జీవితంలో చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి వెళ్లాలన్నదే ఈ షార్ట్ ఫిలిం సారాంశం అన్నారు. గీత ఈజ్ మై ఫ్రెండ్ జీవితాన్ని ఏ విధంగా అద్భుతంగా మలుచుకోవచ్చనేది ఈ షార్ట్ ఫిలింలో చూపిస్తామన్నారు.

డైలాగ్‌లను వివరిస్తున్న డైరెక్టర్ సతీష్‌కుమార్

ఇఒగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఇఒ రమేష్

ఐదు ఆలయాల ఇఒగా రమేష్

అభ్యంతరం వ్యక్తం చేసిన యువరాజు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఐదు ఆలయాలకు ఇఒగా టి.రమేష్‌ను నియమిస్తూ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇఒ రమేష్ సోమవారం ఐదు ఆలయాల్లో ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఇఒ రమేష్‌చే ప్రమాణం చేయించారు. సీతారామ స్వామి ఆలయం, పంచముఖేశ్వర స్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయం, సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయం, రాధాకృష్ణ ఆలయాలకు ఇఒగా రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇకపై ఈ ఆలయాల పరిధిలో ఉన్న ఆస్తుల పరిరక్షణ, ఆలయాల ధూపదీప నైవేద్యాలు వంటి అంశాలు ఆయన పర్యవేక్షణలో నిర్వహిస్తారు. సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఇఒ రమేష్ ప్రమాణ స్వీకారానికి వచ్చిన సమయంలో ఆలయ ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసి రాజు అక్కడకి చేరుకున్నారు. ఆలయానికి తాను ధర్మకర్తగా వ్యవహరిస్తున్నానని, ఇంకొకర్ని ఎలా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తాను ఐదు ఆలయాలకు ఇఒగా నియామకమయ్యానని రమేష్ చెప్పారు. పట్టణంలోని ఐదు ఆలయాలకు ధర్మకర్తగా జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమచంద్ర సన్యాసిరాజు వ్యవహరిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ ఐదు ఆలయాల పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయి. వాటిలో కొన్ని ఆస్తులను జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమచంద్ర సన్యాసిరాజు విక్రయించడం వివాదాస్పదమైంది. ప్రధానంగా పట్టణంలోని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన వెంకటేశ్వరా డీలక్స్ స్థలం, దాని పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను జమిందార్ కుటుంబీకులు విక్రయించడంతో గత కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ ఆలయాలకు ఇఒను నియమించాలని కోరుతూ కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో కోర్టు సానుకూలంగా స్పందించి ఇఒ నియామకంపై ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఈవోగా రమేష్‌ను నియమించారు.

త్వరలో డీలక్స్ స్థలాల్లో బోర్డులు : ఇఒ

పట్టణంలోని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన వెంకటేశ్వరా డీలక్స్ స్థలం, దాని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పక్కా నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామని ఇఒ రమేష్ చెప్పారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సిబ్బందిని హెచ్చరించారు. మండల ంలోని కిమ్మి సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ సమయపాలన పాటించి, విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. ఫిర్యాదులు రాకు ండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిం చారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నైట్ హాల్ట్ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రజల సౌకర్యార్థం గుమ్మలక్ష్మీ పురంలో నైట్‌హాల్ట్ బస్సు సర్వీసులను అధికారులు ప్రారంభించారు. ప్రతిరోజు రాత్రి ఎనిమిది గంటలకు పార్వతీపురం ప్రారంభమై గుమ్మలక్ష్మీపురం రాత్రి 10.30 గంటలకు వచ్చి నైట్‌హాల్ట్ ఉంటుంది. తెల్లవారుజామున 5.20 గంటలకు గుమ్మలక్ష్మీపురం నుంచి తిరిగి పార్వతీపురం బయలుదేరి వెళుతుంది.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మక్కువ : మండలంలోని డీసెర్లం ఇసుక రీచ్ నుండి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తుండగా ఎస్సై పి నరసింహమూర్తి పట్టుకున్నారు. మూడు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడిం చారు. ఇదిలా ఉండదా గత కొన్ని రోజులుగా పార్వతీపురం, మక్కువ మండలాలకు సంబంధించిన హౌసింగ్ ఏఈ లు ఇసుక తరలింపుకు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని విలేకరులకు తెలిపారు

ఓటేసిన గిరిజనులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఓటు హక్కు వినియోగించుకోవడమే కాకుండా అత్యధికంగా జనసేన పార్టీకి ఓటు వేసినందుకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన కార్యదర్శి బిపి నాయుడు, సంయుక్త జిల్లా కార్యదర్శి జనసేన జానీలు గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండలంలోని ఇచ్చాపురం గిరిజన గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గిరిజనులతో వారు మాట్లాడారు. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ బి.గౌరినాయుడు, గ్రామస్తులు ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.గౌరు నాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలక వాలంటీర్ ఎం.పుండరీకం, జనసేన బృందం నాయకులు గోపాలు, హరీష్, ధర్మారావు, శ్రీను, బాలకృష్ణ, నాగభూషణ, ఆదినారాయణ, రాము, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆస్పత్రికెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురానికి చెందిన కెంగువ అప్పలనరసమ్మ పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న విషయం తెలుసుకున్న ఇదే గ్రామ సచివాలయ కార్యదర్శి కె.సునీల్ కుమార్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి అప్పలనర్సమ్మకు పింఛన్ అందజేశారు. మండలం లోని 9966 మంది పింఛన్‌దారులు ఉండగా 2158 మందికి బ్యాంకు ఖాతాల్లేనందున అప్పలనరసమ్మకు పింఛన్ పంపిణీ చేసినట్లు సునీల్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పింఛను సొమ్మును అందిస్తున్న కార్యదర్శి

గ్రంథాలయం వద్ద మద్యం షాపును తొలగించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక మండల శాఖా గ్రంథాలయానికి ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని పాఠకులు కోరుతున్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మందుబాబుల హడా విడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. వెంటనే గ్రంథాలయానికి ఎదురుగా ఉన్న వైన్ షాపును దూర ప్రాంతానికి తరలించి అందరికీ మంచి విజ్ఞానాన్ని ఇచ్చే గ్రంథాలయానికి యువత, పాఠకులు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని యువజన సంఘం నాయకులు కొండంగి చిరంజీవి రాజు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకులు కిషోర్ విజయ్ తది తరులు కోరారు. ఈ సమస్య పరిష్కరిం చకపోతే గ్రంథాలయానికి వచ్చిన యువత కూడా మద్యానికి బానిసలైపోయే ప్రమాదం ఉందన్నారు.

మద్యం సీసాలను చూపిస్తున్న నాయకులు